నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, బుధవారం 11 జూన్ 2025 HYDERABAD




ద్రోణి ప్రభావంతో..
## మోస్తరు వానలు

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలు, గాలిలో తేమ 71 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.



మాసబ్‌ట్యాంక్‌లో రోడ్డు మీద చెత్తవేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు చెబుతున్నారు.

గ్రేటర్‌లో చిన్నపాటి గాలి వీచినా.. తేలికపాటి వర్షం కురిసినా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గంటల కొద్దీ బ్రేక్‌డౌన్లతో సరఫరా నిలిచిపోతోంది. వేసవిలో గాలివాన వచ్చినప్పుడు బ్రేక్‌డౌన్ అవడం, హైపిట్లేజీ సమస్యలు, చెట్లకొమ్మలు తాకి ఫీడర్లు ట్రిప్పవడం వంటి విద్యుత్ సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా దృష్టి పెట్టలేదు. పైగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అంటూ పలుచోట్ల చెట్లకొమ్మలు నరికేసినా అవన్నీ తాత్కాలిక పనులుగానే మిగిలిపోయాయి. -సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ):



# గాలి వీచినా.. వాన కురిసినా కరెంట్ కట్

## గ్రేటర్‌లో బ్రేక్‌డౌన్ సమస్యలు

- ఈదురుగాలులతో తెగిపడుతున్న వైర్లు
- తీవ్ర ఇబ్బందుల్లో వినియోగదారులు



రైల్వేకాలనీలో..

గాలి దుమారానికి చెట్లు కూలిపోతే వాటిని తొలగించే క్రమంలో వైర్లు బాగుచేశారే తప్ప ముందస్తు ప్రణాళికను దాదాపుగా అమలు పరచలేదు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో చెట్లకొమ్మలు నరికేయడం ఒక భాగం కాగా చాలాచోట్ల ఇంకా కొమ్మలు అదే స్థితిలో ఉండడం కనిపిస్తోంది. కొమ్మల మధ్యలో కరెంట్ తీగలు ఉండడం మూలాన గాలి దుమారానికి, వర్షానికి చెట్ల కొమ్మలు ఊగడం, విరగడం వల్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయమేర్పడుతుంది. విద్యుత్ లైన్లకు దగ్గరగా పెరిగే చెట్ల వల్ల విద్యుత్ అంతరాయమేర్పడుతున్నదని, వెంటనే అటువంటి పరిస్థితులను గుర్తించి పరిష్కరించాలని సీఎండీ ముషారఫ్ తమ అంతర్గత సమావేశంలో సిబ్బందితో చర్చించారు. ఎక్కడెక్కడా చెట్లలో విద్యుత్ తీగలు ఉన్నాయో వాటిని గుర్తించి అవి తొలగించే పరిస్థితి ఉందా.. లేకుంటే ప్రత్యామ్నాయమేంటనే విషయాలపై నివేదిక వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఈ సంవత్సరం వేసవి కంటే వానకాలంలోనే ఎక్కువగా కరెంట్ పోతున్న పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని గ్రేటర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌లో ఉన్న పది సర్కిళ్లలో ఎప్పుడు కరెంట్

మిగతా IVవ పేజీలో



ప్రకాశ్‌నగర్‌లో..



నిధులు పెంచాలని మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## బోనాలకు సర్కార్ నిధులు పెంచాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 10: ఆషాఢ మాస బోనాలను వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వం నిధులను పెంచాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. మంగళవారం ఆషాఢ మాసం బోనాల ఏర్పాట్లపై దేవాదాయ ధర్మాదాయ శాఖ, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి సంస్థ తుంగభద్ర గులాబీ ఎస్కే హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గానికి ఆషాఢ మాస బోనాల పండుగ ఏర్పాట్లకు నిధులు పెంచాలని, నియోజకవర్గం లోని పెద్ద దేవాలయాలకు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించే విధంగా సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తికి మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ, హైదరాబాద్ ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఎంపీ మందాడి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, డీజీపీ జితేందర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, వివిధ ఆలయాల కమిటీల సభ్యులు, వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత కిశోర్, బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, అమీనుద్దీన్,శోభన్ బాబు, యాదగిరి గౌడ్, శరణగిరి, సురేశ్, ఉస్మాన్, హేమంత్ పటేల్, వంశీ, ఓం రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు గ్రేటర్ ముస్తాబు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ

- ఈ నెల 26న ఆషాఢ బోనాల జాతర
- జూలై 24న ఉత్సవాల ముగింపు
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రుల సమీక్ష

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): బోనాల ఉత్సవాలకు గ్రేటర్ ముస్తాబవుతోంది. 26వ తేదీన గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, 13న ఉజ్జయినీ మహంకాళి, 14న రంగం, 20న పాత బస్తీ అక్కన్న, మాదన్న బోనాల జాతర, 24న బోనాల ఉత్సవాలు ముగియనున్నాయి. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గౌడ్ మంగళవారం జూబ్లీహిల్స్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఆషాఢ బోనాల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బందోబస్తు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఎలక్ట్రిసిటీ అన్ని విభాగాలతో సమీక్ష చేపట్టనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. 3,026 దేవాలయాలు బోనాల ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుతున్నాయని, నిధుల్లో 10 శాతం పెంచనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేవాయాలయాలకు నిధులు రాకుంటే అప్లికేషన్ పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, డీజీపీ జితేంద్ర, సీపీ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.



# రేవంత్ ఇంకెంత దిగజారుతవు

- బస్సు పాస్ చార్జీలు పెంచడం సిగ్గుచేటు
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్
- బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బస్సు భవన్ ముట్టడి




బస్సు భవన్‌ను ముట్టడించేందుకు దూసుకువస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ) /చిక్కడపల్లి : బస్సుల సంఖ్య పెంచాలని విద్యార్థులు ఉద్యమిస్తుంటే.. బస్సు పాస్ చార్జీలు పెంచి పేద బిడ్డల చదువుపై భారం మోపడం అన్యాయమని తెలంగాణ జాగృతి, బీఆర్ఎస్వీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల బస్సు పాస్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బస్ భవన్ వద్ద మంగళవారం మెరుపుధర్నా చేపట్టారు. ''వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన.. ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం'' అంటూ నినాదాలతో బస్సు భవన్ అట్టుడుకింది. విద్యార్థుల బస్సుపాస్ ధరలు రూ.400 నుంచి రూ.600 పెంచి వారి చదువులతో చెలగాటమాడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయంటూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. పేద విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం సరైంది కాదని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో విద్యార్థులపై ఎలాంటి భారం మోపలేదని గుర్తు చేశారు. బస్సుల సంఖ్యను పెంచకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఇంకెంత దిగజారుతావు అంటూ విమర్శించారు. పేద పిల్లలు ఉపయోగించుకొనే బస్సు పాస్‌ల ధరలు పెంచడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.



విద్యార్థులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు




ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

## సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వానికి విద్యార్థులు, తల్లిదండ్రుల వినతి
- ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం

ఖైరతాబాద్, జూన్ 10: దేశానికి భావిభారత సైనికులను అందించేందుకు తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణారెడ్డి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయకపోవడంతో ఇక్కడి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ విద్యార్థులు ప్రస్తుత ఏపీ రాష్ట్రంలోని కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూళ్లలో పదేళ్ల పాటు ప్రైవేట్ విద్యార్థులుగా అడ్మిషన్లు పొంది చదువును పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ఇటీవల తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు నాన్‌లోకల్ అంటూ ఏపీకి చెందిన సైనిక్ స్కూల్ సర్క్యులర్ జారీ చేయడంతో ఇక్కడి విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలోనూ సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ సైనిక పాఠశాల పేరెంట్స్ అసోసియేసన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాము సాగర్, ఐలయ్య, పోచయ్య ముదిరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ. 21 వేలు పెడితే.. లక్షల్లో లాభాలంటూ..

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పేరుతో ఫేక్ వీడియోలు

IVలో

## రేపటి నుంచి బస్సు పాస్‌లు జారీ

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు బస్సు పాస్‌ల జారీ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమవుతుందని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్‌లో ఆరాంఘర్, అఫ్జల్‌గంజ్, బాలానగర్, బోరబండ, సీబీఎస్,చార్మినార్, దిల్‌షుక్‌నగర్, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్, ఫరూక్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, జేబీఎస్, కాచిగూడ, కోటి, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, లక్డికపూల్, ఎల్‌బీనగర్, లింగంపల్లి, లోతుకుంట, మేడ్చల్, మెహిదీపట్నం, మిధాని, మొయినాబాద్, ఎన్‌జీఓ కాలనీ, పఠాన్ చెరు, రైతిఫైల్ సికింద్రాబాద్, ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్, సనత్‌నగర్, సెక్రటేరియెట్, శంషాబాద్, ఎస్ఆర్‌నగర్, షాపూర్‌నగర్, తార్నాక, ఉప్పల్, ఉమెన్స్ కాలేజీకోఠి కేంద్రాల్లో బస్సు పాస్‌లు పొందొచ్చని వివరించారు. సమాచారం కోసం 8008204216, tgsrtcpass.com ను సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

## మోగనున్న బడిగంట

### రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభం



సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : వేసవి సెలవులు ముగిశాయి. రేపటి నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఇక ఎప్పటి లాగానే బడి గంటలు మోగనున్నాయి. సెలవుల్లో హాయిగా, ఆనందంగా గడిపిన చిన్నారులు ఇక భుజాన బ్యాగులు వేసుకుని బడికి వెళ్లే సమయం ఆసన్నమైంది. ఇప్పటికే పిల్లలు, తల్లిదండ్రులు ఈ విద్యా ఏడాదికి సంబంధించిన స్టేషనరీ, బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు తదితర సామగ్రి కొనుగోళ్లతో నగరంలోని స్టాల్స్ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు సర్కార్ బడులు విద్యార్థులను ఘనంగా ఆహ్వానించేలా తరగతి గదులను డెకరేషన్ చేయించడానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రవాణా శాఖ పరిధిలో 12,842 విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. కాగా, కొన్ని ఇంటర్నేషనల్ స్కూల్స్ ఇప్పటికే ప్రారంభం కాగా, అధిక శాతం స్కూళ్లు గురువారం ప్రారంభం కానున్నాయి.




యూసుఫ్‌గూడలోని బస్తీ దవాఖాన

# వేతనాలు అందక వేతలు

- బస్తీ దవాఖానల్లో జీతాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న వైద్య సిబ్బంది
- కుటుంబం కోసం అప్పులు చేస్తున్న వైనం
- గత ప్రభుత్వంలో సకాలంలో వేతనాలు
- కాంగ్రెస్ పాలనలో తీవ్ర జాప్యం

**సిటీబ్యూరో/జూబ్లీహిల్స్, జూన్10 (నమస్తే తెలంగాణ):** బస్తీవాసులకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉచితంగా వైద్యసేవలందించే బస్తీ దవాఖానలు కాంగ్రెస్‌పాలనలో నిర్వీర్యమయ్యాయి. నాణ్యమైన వైద్యసేవలందించడంలో విఫలమవ్వగా, పనిచేసే సిబ్బందికి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా పెండింగ్ వేతనాలు ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 450 బస్తీదవాఖానలు ఉండగా, గ్రేటర్ పరిధిలోనే 300 బస్తీ దవాఖానలు పేద ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాయి. ప్రతి బస్తీ దవాఖానలో మెడికల్ అధికారి, స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్‌తో కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా 1300కు పైగా వైద్యసిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా వేతనాలు రాక కుటుంబాలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజల చెంతకు వైద్యమందించాలని నాటి బీఆర్ఎస్ సర్కార్ పట్టణాల్లో బస్తీదవాఖానలు ఏర్పాటు చేసింది. కేసీఆర్ అధికారంలో ఉన్న రోజుల్లో వాటిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండేది. సిబ్బంది వేతనాలు, కావాల్సిన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేవి. కాంగ్రెస్ పదిహేను నెలల పాలనలో వైద్యరంగాన్ని పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసింది. గ్రేటర్‌లో ఉన్న బస్తీ దవాఖానల్లో ప్రస్తుతం సరిపడా మందులు లేక, ప్రైవేట్ ఫార్మసీలను ఆశ్రయిస్తున్న తరుణం ఏర్పడింది. సిబ్బందికి వేతనాలు వేయమంటే ఖజానా ఖాళీ అయిందంటూ తప్పించుకు తిరుగుతుంది.

### అప్పులు చేస్తున్న సిబ్బంది..

గతంలో హరీశ్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు వైద్యసిబ్బందితో నిత్యం సమీక్షలు నిర్వహించిన సందర్భాల్లో వారి బాగోగులు

మిగతా IVవ పేజీలో

నారాయణగూడ చౌరస్తాలో జీహెచ్ఎంసీ మార్కెట్ బిల్డింగ్ పనులు పూర్తి అయినప్పటికీ ప్రారంభించకుండా వదిలేశారు. దీంతో దుకాణదారులు రోడ్డు బయట పెట్టుకోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. వెంటనే మార్కెట్‌ను ప్రారంభించాలని షాపు యజమానులు కోరుతున్నారు.





## 14న జాతీయ లోక్ అదాలత్

చర్లపల్లి,జూన్ 10 : జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్.శ్రీదేవి సూచించారు. చర్లపల్లి డివిజన్ కుషాయిగూడలోని జిల్లా కోర్టులో ఆమె మాట్లాడుతూ జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 14న కుషాయిగూడలోని జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులతో పాటు రాజీపడదగిన క్రిమినల్, వాహన ప్రమాదాలు, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, భూ వివాదాల వంటి కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయాన్ని పొందాలని ఆమె సూచించారు.